క్లుప్తంగా

రేపు అష్టావధానం

నారాయణఖేడ్: మండలంలోని చాప్టా(కె) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సాహితీ కళాప్రవీణ స్వర్ణకంకణ సత్కార గ్రహీత పద్యశిల్పి యువ అవధానిచే అష్టావధానం నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్‌ఎం నర్సింహులు తెలిపారు. పద్యకవి సీహెచ్. భూమయ్య రచించిన శ్రీరామశతకం ఆవిష్కరణోత్సవం సైతం ఉంటుందన్నారు. అష్టవధానులు కసిరెడ్డి వెంకటరెడ్డి, కంది శంకరయ్య, చక్రవర్తి హాజరవుతున్నారని చెప్పారు. తెలుగు భాషాభిమానులు, కవులు, సాహితీ ప్రియులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన దర్గా ఉత్సవాలు



చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

నారాయణఖేడ్: మండలంలోని జుజాల్‌పూర్ శివారులోని సయ్యద్ గట్టు మౌలాలి దర్గా గంధాల ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు జల్సా, అలయ్, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి హాజరుకాగా ఆయనను నిర్వాహకులు శాలువాతో సన్మానించారు.

నేటి నుంచి ఆలయ ప్రారంభోత్సవాలు

నారాయణఖేడ్: పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌక్ సమీపంలో నిర్మించిన మార్కండేయ మహాదేవాలయ ప్రారంభోత్సవాలు సోమవారం నుంచి 6 వరకు నిర్వహించనున్నారు. మహోత్సవాలకు వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు హాజరవుతున్నారని నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవానికి ఆలయాన్ని ముస్తాబు, తదితర ఏర్పాట్లు పూర్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



మార్కండేయ ఆలయం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని హమాలీ కాలనీలో ఆదివారం నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. హరే రాధ కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నగర సంకీర్తనకు మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పెద్దతల్లి ఆలయం నుంచి హమాలీ కాలనీ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం నిర్వహకులు భక్తులు అల్పాహారం అందజేశారు.

దైవభక్తిని అలవర్చుకోవాలి

న్యాయవాది నాగరాజు యాదవ్



హనుమాన్ చాలీసా పారాయణంలో భక్తులు

పటాన్‌చెరు టౌన్: ప్రతీ ఒక్కరు దైవభక్తిని అలవర్చుకోవాలని న్యాయవాది నాగరాజు యాదవ్ అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి పోచారంలోని హనుమాన్ దేవస్థానం వద్ద భక్తులతో కలిసి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లల్లో భక్తిభావంతో పాటు దేశభక్తిని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో వివేకానంద సేవ సమితి అధ్యక్షుడు శేషాద్రి, బజరంగ్ దళ్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీపాదరావుకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు

నారాయణఖేడ్: ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తండ్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ శాసనసభాపతి శ్రీపాదరావు జయంతిని ఆదివారం హైదరాబాద్‌లోని శాసనసభ లాంజ్‌లో నిర్వహించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రేపు హుండీ లెక్కింపు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్కలలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ తెలిపారు. ఉదయం 11 గంటలకు భక్తుల సమక్షంలో 5 నెలలకు సంబంధించి హుండీని లెక్కిస్తామన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు.. పర్యావరణానికి అనర్థాలు

- నామమాత్రపు జరిమానాతో సరిపెడుతున్న అధికారులు
- ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లే
- మామూళ్ల మత్తులో మున్సిపల్ సిబ్బంది



బబ్బిలికుంటలో కుప్పలుగా ప్లాస్టిక్ వ్యర్థాలు

సంగారెడ్డి: పర్యావరణానికి ముప్పు అంటూనే ప్లాస్టిక్ కవర్ల వాడకంపై అధికారులు మౌనం పాటిస్తున్నారు. దుకాణదారులు చెత్తను డబ్బాల్లో పోగేసి మున్సిపాలిటీ వాహనాల్లో వేయాలి. అయితే ఎవరూ పాటించడం లేదు. విచ్చలవిడిగా రోడ్ల పక్కనే పడేస్తున్నారు. పారిశుద్ధ్య విభాగంలో పని చేసే సిబ్బంది మామూళ్లు తీసుకుని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు మెండుగా వినిపిస్తున్నాయి. దీంతో ప్లాస్టిక్ నిషేధం ప్రచారానికే పరిమితమైంది. చిన్న దుకాణం నుంచి పెద్ద వ్యాపార సంస్థ వరకు యథేచ్ఛగా వాడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. కొన్నిచోట్ల మామూళ్లు తీసుకుని వదిలేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదేశాలు వచ్చినప్పుడు నామమాత్రపు తనిఖీలు చేయడం, ఫైన్లు వేసినా ఆ డబ్బులు సైతం ఎక్కడ వెళ్తున్నాయి అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

వస్త్రపు సంచుల వాడకాన్ని ప్రోత్సహించాలి

వస్త్రంతో తయారు చేసిన సంచులు వాడేలా ప్రోత్సహించాలని అధికారుల ఆదేశాలు ఎక్కడా అమలు కావడం లేదు. వాటి తయారీపై మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇప్పించాలి. ఇందిరా మహిళా శక్తి కింద రుణాలు ఇప్పించి సంచులు తయారు చేయించాలి. వాటిని వ్యాపారులకు విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. మహిళలకు ఆదాయం రావడమే కాకుండా పాలిథీన్ కవర్లు వాడకుండా అడ్డుకట్ట వేసినట్లవుతుంది.

–చంద్రశేఖర్, రిటైర్డ్ ఉద్యోగి, సంగారెడ్డి

తనిఖీలు చేపడతాం



పట్టణంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇకనుంచి వ్యాపార సముదాయాలు తనిఖీలు నిర్వహించి వారికి ఫైన్లు విధిస్తాం. నిషేధంపై అవగాహన కల్పిస్తాం. అధికారులు మామూళ్లు తీసుకున్నట్లు రుజువైతే వారిపై కఠిన చర్యలుతీసుకుంటాం.

–ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్, సంగారెడ్డి.

ఉచిత వైద్య శిబిరాలతో మేలు

కాంగ్రెస్ నేత నీలం మధు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న నీలం మధు

పటాన్‌చెరు: గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటుతో పేదలకు లబ్ధి చేకూరుతుందని కాంగ్రెస్ నేత నీలం మధు అన్నారు. ఆదివారం చిట్కుల్ గ్రామంలో నీలం మధు సహకారంతో మెడిస్టార్ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో సామాన్యులకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం కాలుష్యం, రసాయనాలతో పంటల్ని పండించడం, కలుషిత ఆహారం తీసుకోవడం, శరీరానికి తగిన వ్యాయామం లేకపోవడం వల్ల అనేక వ్యాధుల బెడద పెరిగిందన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా రోగాన్ని తెలుసుకుంటే తగిన చికిత్స తీసుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మెడిస్టార్ ఆస్పత్రి డాక్టర్ కిరణ్, మేనేజింగ్ డైరెక్టర్ లత, డాక్టర్లు శివ మోహన్‌రెడ్డి, సంతోష్, ప్రకాశ్ పాల్గొన్నారు.

భక్తుల కోరికలు తీర్చేదైవం పెద్దమ్మ తల్లి

పటాన్‌చెరు టౌన్: కోరిన కోర్కెలు తీర్చే దైవం పెద్దమ్మ తల్లి అని కాంగ్రెస్ నేత నీలం మధు అన్నారు. ఆదివారం మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం.. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమ్మతల్లి వార్షికోత్సవంలో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు నీలం మధుకు స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ..ఆలయాల నిర్మాణంతో పాటు వార్షికోత్సవాలు నిర్వహించడం వల్ల గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుందన్నారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ సంఘం ప్రెసిడెంట్ వెంకటేష్, ఆలయ కమిటీ చైర్మన్ రవికుమార్, తలారి వెంకటేశ్, మహేష్, కృష్ణ, యాదగిరి, ఎంపీ మాణిక్యరావు, మహేశ్, బాబ్లు, ప్రవీణ్, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు కిసాన్ సంఘ్ ఆవిర్భావ వేడుకలు

సంగారెడ్డి టౌన్: భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ వేడుకలను సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం రైతులతో సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగరాజు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఇండియన్ గ్యాస్ నిర్వాహకులు, డీసీసీ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఇండియన్ గ్యాస్ కార్యాలయంలో మేనేజర్‌గా పని చేస్తున్న నాగరాజు వారం రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంతో మృతి చెందాడు. మృతుడి భార్య చిట్టికి ఆదివారం భాస్కర్‌రెడ్డి రూ.50వేలు, ఐఒసీఎల్ మేనేజర్లు రూ. 87 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా కార్యాలయంలో పని చేస్తున్న నాగరాజు మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో న్యాల్‌కల్ పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్యస్వామి, జనార్దన్‌రెడ్డి, చందుస్వామి, కుమార్ పాల్గొన్నారు.

సొంత డబ్బులతో మురికి కాల్వ పనులు



మురికి కాల్వ పనులు చేపట్టిన నాయకులు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మక్సూద్, మసీదు కమిటీ సభ్యులు నాయబ్ సదర్ ఫసీయోద్దీన్, ఆరీఫ్, జావీద్‌లు తమ సొంత డబ్బులతో గ్రామంలోని మురికి కాల్వ నిర్మాణ పనులను చేపట్టారు. రాయికోడ్‌లోని మసీదు ఎదుట సుమారు 60 మీటర్ల పొడవున మురుగు కాల్వ నిర్మించనున్నట్లు మక్సూద్ తెలిపారు. ఇందుకు రూ.3 లక్షలు కమిటీ సభ్యులతో కలిసి వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. రంజాన్ మాసం నేపథ్యంలో మసీదు ప్రాంగణం వద్ద శుభ్రత నెలకొల్పడం కోసం పనులు ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీడీఆర్ మండల నాయకులు సార దుర్గేశ్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో కాలిపోయిన షెడ్డు



కాలిపోయిన షెడ్డు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అల్గోల్ రోడ్డులో ఉన్న వినాయక విగ్రహాల తయారు షెడ్డులో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. షెడ్డుకు ఆకస్మాత్తుగా మంటలు అంటుకోవడంతో షెడ్డు కాలిపోయింది. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపు చేసింది. ఈ ప్రమాదంలో విగ్రహాలను తయారుచేసే పరికరాలు, సరుకులు కాలిపోయాయి.

బ్లాస్టింగ్‌లపై గ్రామస్తుల ఆందోళన



ఆందోళన చేస్తున్న దొంతి, మల్లుపల్లి గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): అక్రమ బ్లాస్టింగ్‌లపై గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. మండల పరిధిలోని మల్లుపల్లి పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 526లో ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద బండరాళ్లను నిషేధిత పేలుడు పదార్థాలతో బ్లాస్టింగ్ చేస్తు రైతులకు ఇబ్బందుకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమికి సంబంధించి నకిలీ పట్టాలు సృష్టించి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు దొంతి, మల్లుపల్లి గ్రామస్తులు ఫణి శశాంక్‌శర్మ, భవనగారి శ్రీనివాస్, రాంచందర్‌నాయక్, భిక్షపతి, ప్రవీణ్, మహేశ్ ఆరోపించారు. బ్లాస్టింగ్ చేస్తున్న భూమికి పక్కనే శ్మశాన వాటిక, డంపింగ్ యార్డులు ఉన్నప్పటికీ రియల్ వ్యాపారులు అవేమి పట్టించుకోకుండా పెద్ద ఎత్తున బ్లాస్టింగ్ చేస్తుండడం వల్ల వాటికి నష్టం జరుగుతుందన్నారు. ఈ విషయం గురించి రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోయారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా బుదేరా

మంత్రి దామోదర రాజనర్సింహ



వైదిక పాఠశాల మ్యాపును పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

మునిపల్లి(అందోల్): ఆధ్యాత్మిక కేంద్రంగా బుదేరాను తీర్చిదిద్దుతామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం మండలంలోని బుదేరా శివారులో గల హనుమాన్ దేవాలయం వద్ద వైదిక పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బర్దిపూర్ దత్తాత్రేయ పీఠాధిపతి అవదూత గిరి మహరాజ్ మాట్లాడుతూ.. లోక కల్యాణం కోసం బుదేరా శివారులో వైదిక పాఠశాలను ఏర్పాటు చేసి కులమతాలకతీతంగా పిల్లలకు వేదాలు నేర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిద్దేశ్వర్ మహరాజ్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ మనోహర్ యాదవ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సతీష్ కుమార్, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95 పదోవ తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకొని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 30 ఏళ్ల తర్వాత కలుసుకొని పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు యోగాక్షేమాలు తెలుసుకొని ఆనందించారు. చదివిన బడి పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. అప్పటి గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈరోజు ఉన్నత స్థాయిలో ఉన్నామని విద్యార్థులు వెల్లడించారు.

రోడ్డుకు మరమ్మతు చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న వివిధ కాలనీవాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓఆర్ఆర్ 30 ఎక్స్‌టెన్షన్ రేడియల్ రోడ్డు ధ్వంసమై గుంతలమయంగా ఏర్పడింది. సంబంధిత అధికారులు రోడ్డుకు ఎందుకు మరమ్మతులు చేపట్టడం లేదని ఆదివారం తెల్లాపూర్ గేటెడ్ కమ్యూనిటీ కాలనీ వాసులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు శ్రమదానం చేసి గుంతలను పూడ్చివేశారు. వారు మాట్లాడుతూ.. అనేక ఏళ్లుగా ఈ రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. రోడ్డుపై పెద్ద ఎత్తున మట్టి చేరి, గుంతలు ఏర్పడినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. దీంతో స్వయంగా తామే శ్రమదానం చేసి రోడ్డుకు మరమ్మతు పనులు చేశామని చెప్పారు. ఈ మార్గంలో ఉన్న ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈరోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని ప్రభుత్వం ఎందుకు అభివృద్ధి చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వెల్నెస్ ఆస్పత్రిపై విచారణ

సంగారెడ్డి: బాలింత మృతి సంఘటనపై వైద్య ఆరోగ్య శాఖ స్పందించింది. ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా వైద్య బృందం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. జహీరాబాద్‌లోని నీలం హాస్పిటల్, సంగారెడ్డిలోని వెల్నెస్ హాస్పటల్ సందర్శించి మహానందిని మృతికి గల కారణాలపై ఆరా తీశారు. హాస్పిటల్లో ఇచ్చిన వైద్య చికిత్సకి సంబంధించిన వివరాలు సేకరించారు. అనంతరం రెండు ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చారు. వెల్నెస్ హాస్పిటల్ పై తగు చర్యలకు పోలీసుశాఖకు సూచించినట్లు జిల్లా ఇన్‌చార్జి వైద్య అధికారి నాగ నిర్మల తెలిపారు.

డంప్‌యార్డు వద్దంటూ దీక్షలు

నర్సాపూర్: డంప్‌యార్డు వద్దంటూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 13వ రోజుకు చేరాయి. గుమ్మడిదల్ల మండలం ప్యారానగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డును ఎత్తి వేయాలని నర్సాపూర్‌లో జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. ఆదివారం జేఏసీ నాయకులు రాజేందర్, రమణరావు, రిజ్వాన్, సుబ్రమణ్యం, నవీన్‌లతో పాటు మొబైల్ షాప్స్ అసోఎయేషన్ ప్రతినిధులు గోపి, జ్ఞానేశ్వర్, శ్రవన్, ప్రభు, శంకర్, ఫైజల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ తదితరులు

న్యాల్‌కల్(జహీరాబాద్): కుంభమేళాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గంగ్వార్ గ్రామానికి చెందిన ఇరిగేషన్ డీఈఈ వెంకట్‌రాంరెడ్డి కుటుంబాన్ని ఆదివారం ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, మాజీ మంత్రి, జహీరాబాద్ ఇన్‌చార్జి డాక్టర్ చంద్రశేఖర్ పరామర్శించారు. వెంకట్‌రాం రెడ్డి దంపతుల మృతికి గల కారణాలను వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి మల్గి గ్రామానికి వెళ్లిన మల్లారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, జహీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రప్ప, పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్యస్వామి, నాయకులు రఫీయోద్దీన్, రత్నం తదితరులు ఉన్నారు.

తెగిపడిన కరెంట్ తీగలు.. తప్పిన ప్రమాదం



రోడ్డుపై తెగిపడిన విద్యుత్ తీగలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని మహీంద్ర కాలనీలో ఆదివారం కరెంట్ తీగలు తెగిపడ్డాయి. దశాబ్దాల క్రితం కాలనీలో కరెంట్ సౌకర్యం కల్పించారు. కరెంట్ తీగలతో పాటు కేబుల్ తీగలు స్తంభాలకు పిచ్చుక గూళ్ల మాదిరిగా అల్లుకుపోయాయి. తీగలు పాతపడడంతో ఆకస్మత్తుగా తెగి కింద పడ్డాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. కాలనీ ప్రజలు ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేయడంతో తీగలను సరిచేశారు. కాలం చెల్లిన తీగల స్థానంలో కొత్త లైన్ వేయాలని ప్రజలు కోరుతున్నారు.

తీరనున్న ట్రాఫిక్ కష్టాలు



లింగంపల్లి చౌరస్తాలో సిద్ధమైన ఫ్లైఓవర్



ఫ్లైఓవర్ నిర్మాణానికి ముందు లింగంపల్లి చౌరస్తాలో ట్రాఫిక్ (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని లింగంపల్లి చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంగతి అందరికీ తెలిసిందే. 2022లో జ్యోతినగర్ నుంచి లింగంపల్లి చౌరస్తా మీదగా చందానగర్ వరకు ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.130కోట్ల నిధులు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసి పనులు చేపట్టింది. ప్రస్తుతం ఫ్లైఓవర్ పనులు పూర్తికావడంతో స్థానికులు, వాహనదారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. నిత్యం గంటకు పైగా ట్రాఫిక్ జామ్‌తో ఇక్కట్లు పడిన వాహనదారులు ఫ్లైఓవర్ పూర్తికావడంతో సంబరపడుతున్నారు. ప్రస్తుతం ఫ్లైఓవర్‌ను అధికారికంగా ప్రారంభించకపోయిన వాహనాల రాకపోకలకు అనుమతి ఇచ్చారు. ట్రాఫిక్ జామ్ లేకుండా వాహనదారులు ప్రశాంతంగా ప్రయాణం సాగిస్తున్నారు.